క్లుప్తంగా

అయోధ్య అక్షింతల పంపిణీ



అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనిత తదితరులు

తుర్కయంజాల్: అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ కార్యక్రమంలో హిందువులంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని కౌన్సిలర్ అనిత కోరారు. శనివారం ఆమె రాగన్నగూడలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్వాల్‌రెడ్డితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సెమిస్టర్ పరీక్షలు

ఇబ్రహీంపట్నం: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులకు మూడవ సెమిస్టర్, మూడో సంవత్సరం విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి మాసంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభు, కోఆర్డినేటర్ డాక్టర్ నాగోజి తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువుందన్నారు. అయితే రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 23 వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. క్రెడిట్, డెబిట్ కార్డులతోనే ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 7382929772 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



జంగయ్య గౌడ్

మంచాల: మండల కేంద్రంలో నిరంతరం ఆధార్ కేంద్రం కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆధార్ కేంద్రం లేక పోవడంతో మండలంలోని 23 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా మండల కేంద్రంలో ప్రత్యేకంగా ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: కురిమిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. జిల్లా కలెక్టర్‌గా వికాస్, జిల్లా విద్యాధికారిగా శివరాం, మండల విద్యాధికారిగా ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులుగా మనీషా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ, జగన్ ఉన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



పై కప్పులేని మ్యాన్‌హోల్

మంచాల: తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌ను మూసి వేయాలని కోరినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని లోయపల్లి గ్రామస్తులు ఆరోపించారు. మంచాల మండల పరిధి లోయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం దానిపై కప్పు పడిపోయింది. అధికారులు త్వరగా స్పందించి పై కప్పు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారులకు సత్కారం



మహేశ్, సతీశ్‌ను సన్మానిస్తున్న రాము

ఆమనగల్లు: అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన కరాటే క్రీడాకారులు మహేశ్, సతీశ్‌కుమార్‌ను శనివారం లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో కరాటే క్రీడాకారులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మహేశ్ గోల్డ్ మెడల్, కడ్తాల్ మండలం ముద్విన్‌కు చెందిన సతీశ్‌కుమార్ సిల్వర్‌మెడల్ సాధించారు.

ముగిసిన ‘ప్రజాపాలన’

- ప్రతి ఒక్కరికీ సంక్షేమం
- జనవరి 6 వరకు కొనసాగిన కార్యక్రమం
- దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు
- వెల్లువలా అర్జీలు



ఆమనగల్లు: దరఖాస్తులు స్వీకరిస్తున్న అనంతరెడ్డి, అధికారులు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం శనివారం ముగిసింది. గత నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఆరు గ్యారంటీలకు 7,056, ఇతర సమస్యలపై 1,838 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. ఈ నెల 17 వరకు దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామాల నుంచి 10,371, ఇతర సమస్యలపై 672 దరఖాస్తులు ప్రజాపాలనలో వచ్చినట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తులు స్వీకరించిన ఎంపీపీ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో అభయ హస్తం ప్రజాపాలన గ్రామసభలు ముగిశాయి. మండలంలో అన్ని గ్రామాల్లో గత నెల 28న ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాల దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభలో శనివారం వైస్ ఎంపీపీ అనంతరెడ్డి పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని 13 గ్రామాల్లో 5,426 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. అభయహస్తం పథకం కోసం 5,785 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 747 దరఖాస్తులతో కలిపి మొత్తం 6,532 దరఖాస్తులు వచ్చినట్లు శ్యాంసుందర్ తెలిపారు.

దరఖాస్తుల నమోదుపై అవగాహన

ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదుపై మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ సిబ్బందికి అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మాడ్గుల మండలంలో 6,576 దరఖాస్తులు

మాడ్గుల: మాడ్గుల మండలంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలు శనివారంతో ముగిశాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో గత నెల 28న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాపాలనలో మండలవ్యాప్తంగా మొత్తం 16,576 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాఘవులు ఓ ప్రకటనలో తెలిపారు.



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

ప్రజాపాలనకు అనూహ్య స్పందన

తలకొండపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. శనివారం మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా శనివారం 1,334 దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 12,365 గృహాలు ఉండగా, ఇప్పటివరకు 13,677 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, అధికారులు పుష్ప, ప్రసన్న, మాజీ ఎంపీటీసీ యాదయ్య, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అర్హులకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రజాపాలనలో మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం జరిగిందని, పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యానికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు 100 రోజుల్లో సంక్షేమ పథకాలు అందించాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు బుచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఆన్‌లైన్‌లో ‘ప్రజాపాలన’

మంచాల: మండలవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు స్వీకరించిన దరఖాస్తులను అధికారులు శనివారం ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో అభయహస్తం కింద 14,993 దరఖాస్తులు రాగ, ఇతర సమస్యలపై 3,691 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తులను గ్రామాల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించండి మేడం..



లక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాడి రైతు సంఘం నాయకులు

కడ్తాల్: తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మిని శనివారం కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడి రైతు సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా పాడి రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నెల రోజులుగా పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదని, బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో పాటు విజయ డెయిరీ నుంచి పశుగ్రాసం, దాణ సరఫరా కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన లక్ష్మికి పాడి రైతులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ విజయ డెయిరీ సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు బీచ్యా నాయక్, కృష్ణయ్య, రంగయ్య ,శ్రీకాంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవే ‘లయన్స్’ లక్ష్యం

ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లుగౌడ్

ఆమనగల్లు: ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించడమే లయన్స్ క్లబ్‌ల లక్ష్యమని ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. ఆమనగల్లు లయన్స్ సేవలను మరింత విస్తృత పరుస్తామని చెప్పారు. పట్టణంలోని భవాని గార్డెన్స్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణలో లయన్స్‌క్లబ్‌లు ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ప్రతినెలా రెండు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు ఓంకారం, చంద్రశేఖర్, యాదయ్య, లయన్స్ క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొర్వి వెంకటయ్య, పీఆర్‌ఓ పాషా, సభ్యులు మనోహర్‌రెడ్డి, మురళీధర్, చంద్రశేఖర్, కండె సత్యం, రాంరెడ్డి, జూలురి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

హస్తినాపురం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి పాఠశాలలోని వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, మమత, మల్లేశ్‌గౌడ్, రేణుక, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోండి



ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న మహేశ్ తదితరులు

తలకొండపల్లి: రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు (సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్) వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని కోరారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ కార్యాలయంలో ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి శృతికి వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక టాస్క్‌పోర్స్‌ను నియమించి చట్ట వ్యతిరేకంగా నడుస్తున్న కళాశాలలను మూసివేయించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకుంటామని శృతి తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర కమిటీ సభ్యులు రేవంత్‌గౌడ్, హరీశ్, శ్రీకాంత్, మల్లేశ్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని అధికారులు శనివారం లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి భక్తులు వేసిన విరాళాలను దేవాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈవో మురళీ కృష్ణ, పాలక మండలి చైర్మన్ కోట్ల వెంకటేష్‌ల పర్యవేక్షణలో లెక్కించగా రూ.1,18,354లుగా తేలింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంక్రాంతికి ముగ్గుల పోటీలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈ లెక్కింపులో కమిటీ సభ్యులు పద్మ శంకర్ గౌడ్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, గ్రామ నాయకులు నరేందర్ గౌడ్, స్వామి, శేఖర్, వీరేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘విజ్ఞాన్’లో ‘ఇన్నోవేటివ్ ప్రాజెక్టు ఎక్స్‌పో’



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామ శివారులోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ‘ఇన్నోవేటివ్ ప్రాజెక్టు ఎక్స్‌పో – 2024’ పేరుతో నిర్వహించిన సాంకేతిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజ్ఞాన్ విద్యాసంస్థల సీఈఓ బోయపాటి శ్రవణ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గా సుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో సాంకేతిక విలువలను పెంచేందుకు ఇలాంటి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సైబర్ భద్రత, సౌరశక్తి, బ్యాటరీ టెక్నాలజీ, ఆటోమేషన్, ఐఓటీ, వివిధ విభాగాలకు సంబంధించి 488 ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతలుగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, పలు కంపెనీల ప్రతినిధులు వ్యవహరించారన్నారు.

ప్రిన్సిపాల్‌కి సన్మానం

ఏడేళ్ల నుంచి సెలవు తీసుకోకుండా విధుల నిర్వహణ

మహేశ్వరం: ఏడు సంవత్సరాల నుంచి ఒక్క ప్రభుత్వ సెలవు తీసుకోకుండా పని చేస్తున్న మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రమణమూర్తిని శనివారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. 1988లో ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి అనంతరం ప్రభుత్వ కళాశాల అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. పని చేసిన ప్రతి చోట విద్యార్థుల సంఖ్యను పెంచి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తున్నారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు అనేక రకాలుగా ఆర్థిక, నైతిక సహకారం అందిస్తూ ముందుకెళ్తున్నారన్నారు. ప్రస్తుతం 61 సంవత్సరాల వయసులో కూడా ఒక్క ప్రభుత్వ సెలవు వాడుకోకపోవడం వృత్తి పట్ల తన నిబద్ధతను చాటుతున్నారన్నారు. 2022లో రమణమూర్తి సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుతో సత్కరించిందని తోటి అధ్యాపకులు గుర్తు చేశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడికి సేవా స్ఫూర్తి అవార్డు

దిల్‌సుఖ్‌నగర్: వీఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ 11 వ వార్షికోత్సవ వేడుకలు, నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సమాజానికి వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్ ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు రాజేష్‌కు సేవా స్ఫూర్తి అవార్డు అందజేశారు.

క్రీడలతో మానసిక వికాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ శివప్రసాద్, నాయకులు

సీఐ శివప్రసాద్

కడ్తాల్: క్రీడలతో మానసిక వికాసం పెంపొందుతుందని, యువకులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సీఐ శివప్రసాద్ సూచించారు. సంక్రాతి పండుగను పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ఫార్చున్ బటర్‌ఫ్లై సిటీ క్రీడా మైదానంలో స్థానిక యువకుల ఆధ్వర్యంలో కడ్తాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాకు ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులు, యువకులు క్రీడల్లో చురుగ్గా పాల్గొని, రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, సత్యంయాదవ్, యాదయ్యగౌడ్, వీరయ్య, రవీందర్‌రెడ్డి, గణేశ్, నిర్వాహకులు రాజు, విజయ్‌గౌడ్, మహేందర్ రెడ్డి, జగన్‌యాదవ్, మహేశ్, అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చిన్నారులకు హెల్మెట్ల పంపిణీ

పహాడీషరీఫ్: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని జల్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమీదా అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆలిండియా హెడ్ ఇంజ్యూరీస్ ఫౌండేషన్, సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 102 మంది విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. చిన్నారులు ఇంటి నుంచి తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై వచ్చే సమయంలో కింద పడి గాయాలకు గురవుతుంటారన్నారు. హెల్మెట్ ధరించడం ప్రయాణ సమయంతో పాటు ఆటలాడుకునేటప్పుడు కూడా రక్షణగా ఉంటుందని అఫ్జల్ అన్నారు.



హెల్మెట్లు ధరించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఆటలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

హయత్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపైనా ఆసక్తిని పెంచుకోవాలని, ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యత సాధించవచ్చని ప్రముఖ హాకీ క్రీడాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎన్.ముఖేష్‌కుమార్ అన్నారు. శనివారం హయత్‌నగర్‌లోని జీ స్కూల్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థుల వ్యక్తిగత ప్రతిష్ఠతతో పాటు దేశ ప్రతిష్ఠ కూడా పెరుగుతుందన్నారు. పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. జీ స్కూల్ వంటి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు అనంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగేంద్రబాబు, గిరిజల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూర్ణా శ్రీవాస్తవ, క్రీడా డైరెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘నారాయణ’లో మాస్టర్ ఒరేటర్ గ్రాండ్ ఫినాలే

వనస్థలిపురం: ఎల్‌బీనగర్‌లోని నారాయణ ఈ.టెక్నో ఒలింపియాడ్ బ్రాంచ్‌లో శనివారం నిర్వహించిన మాస్టర్ ఒరేటర్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో వనస్థలిపురం నారాయణ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ భవానీ తెలిపారు. వివిధ బ్రాంచీలకు చెందిన ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆంగ్ల భాషా నైపుణ్యతను ప్రదర్శించి తమ విద్యార్థులు ముందంజలో నిలిచారని కొనియాడారు